

హైదరాబాద్ వార్త

# వైభవంగా బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవం



-ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ

-పుర ప్రముఖులు అధిక సంఖ్యలో అమ్మవారి కళ్యాణాన్ని తిలకించారు



**సంజీవరెడ్డి నగర్, జూలై 21, ప్రభాతవార్త:** బల్కంపేట్ ఎల్లమ్మ అమ్మ వారి కళ్యాణ మహోత్సవం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ కళ్యాణ మహోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి తిలకించారు. తదుపరి అమ్మవారి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కళ్యాణ మహోత్సవానికి ముఖ్య అతిథులుగా సీఎం కుటుంబ సభ్యులు, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్ కుటుంబ సభ్యులు, కొండా సురేఖ కుటుంబ సభ్యులు, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ కుటుంబ సభ్యులు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సతీమణి కావ్య రెడ్డి, శాసనసభ్యులు దానం నాగేందర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, నవీన్ యాదవ్‌ల రాకతో దేవాదాయ శాఖ అధికారులు ఆలయ మర్యాదలతో గౌరవ స్వాగతం పలికారు. దేవాదాయ శాఖ అమ్మ వారి కళ్యాణం తిలకించేందుకు వచ్చే భక్తులు, పుర ప్రజలకు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా మెరుగైన వసతులు కల్పించడం జరిగింది. దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, ఆలయ చైర్మన్ సాయిబాబా, కళ్యాణ మహోత్సవ నేపథ్యంలో ఏర్పాట్లు ఘనంగా చేపట్టారు. త్రాగునీరు విద్యుత్ నిరంతరంగా ఏర్పాటు చేపట్టారు. భక్తులకు ఎక్కడ కూడా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి ఒక్కరికి అమ్మవారి కళ్యాణం తికలించేలా, దర్శనం కలిగేలా ఏర్పాట్లు చేపట్టారు. కళ్యాణం తదుపరి కూడా అమ్మవారిని దర్శించుకొనుటకు భక్తులు ప్రజలు తండోపతండాలుగా తరలివస్తున్నారు. ఈ కళ్యాణ మహోత్సవంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా, డిసిపి ట్రాఫిక్ కాజల్ సింగ్, జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు, ఈవో వినోద్ రెడ్డి, విద్యుత్ జిహెచ్ఎంసి, హెచ్ఎం డబ్ల్యు ఎస్ ఎస్, మెడికల్, రెవెన్యూ, దేవాదాయ శాఖ, పోలీస్ సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# చివరి వరకూ ఆగొద్దు..

-మళ్ళీ గడువు పొడిగింపు ఉండదు

-ఎన్యుమరేషన్ ఫారాలను తొందరగా బిఎల్‌వోలకు ఇవ్వండి

-ఓటర్లకు జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్ పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.వి.కర్ణన్, కలెక్టర్ ప్రియాంక ఆల తదితరులు

**హైదరాబాద్, జూలై 21, ప్రభాతవార్త:** తెలంగాణలో ఎస్ఐఆర్ గడువు పొడిగింపు ఉండదని, ఎన్యుమరేషన్ ఫాంలు తొందరగా బిఎల్‌వోలకు ఇవ్వాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ ఓటర్లకు స్పష్టం చేశారు. ఈమేరకు మంగళవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫామ్ తీసుకున్న ఓటర్లు ఆగస్టు 3 వరకు సమయం ఉందని చెబుతున్నారని, కానీ ఈ ఫాంలన్నింటినీ డిజిటలైజేషన్ చేయాలని..అందువల్ల తొందరగా ఇవ్వండని ఆర్వీ కర్ణన్ కీలక సూచన చేశారు. చివరి రోజు వరకూ ఆగితే.. డిజిటలైజేషన్ చేసే సమయంలో సర్వర్ డౌన్ కూడా అవ్వొచ్చని చెప్పారు. కొన్ని చోట్ల బిఎల్‌వోలు ఐదారు సార్లు ఇంటింటికి వెళ్ళారని గుర్తుచేశారు. హైదరాబాద్ జిల్లాలో 9.59 శాతం ఓటర్లు ఆన్ లైన్లో ఎన్యుమరేషన్ ఫామ్ నింపారని..జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 43 శాతం ఎన్యుమరేషన్ ఫాంలు రిసీవ్ చేసుకుని వివరాలు డిజిటలైజ్ చేశామని ఆర్.వి. కర్ణన్ వివరించారు. ఓటరును భయపెట్టి, ఎన్యుమరేషన్ ఫామ్ ఇవ్వకుండా చేస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఓటు హక్కుకు, వెల్ఫేర్ స్కీమ్‌కు ఎలాంటి సంబంధం లేదని మరోసారి స్పష్టం చేశారు. మీ ఓటు హైదరాబాద్లో ఉన్నా లేక గ్రామాల్లో ఉన్నా వెల్ఫేర్ స్కీమ్స్ పోవని చెప్పారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో నిర్లక్ష్యం వహించిన ఒక ఏఈఆర్‌వోను సస్పెండ్ చేశామని, కొంతమంది బిఎల్‌వోలకు షోకాజ్ నోటీసులు ఇచ్చామని తెలిపారు. బీఎల్వోలు ఎలా పని చేస్తున్నారో చెక్ చేయడానికి విజిలెన్స్ అధికారులు ఫీల్డ్ చెక్ చేస్తున్నారని పేర్కొన్నారు.

**పార్టీలు సహకారం అందించాలి..**

పార్టీలు బిఎల్‌వోలకు సహకారం అందించాలని ఆర్.వి.కర్ణన్ వివిధ రాజకీయ పార్టీలను కోరారు. ఈమేరకు మంగళవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియలో క్షేత్రస్థాయిలో పూర్తి సహకారం అందించాలని అన్ని రాజకీయ పార్టీలను కోరారు. అలాగే, చివరి నిమిషంలో హడావిడిని నివారించేందుకు, తమ పార్టీకి చెందిన బూత్ స్థాయి ఏజెంట్లు ఈ సవరణ ప్రక్రియలో చురుకుగా పాల్గొనేలా, అర్హులైన ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారమ్‌లను వీలైనంత త్వరగా నింపి సమర్పించడంలో వారికి సహాయపడేలా చూడాలని ఆయాపార్టీల ప్రతినిధులకు సూచించారు. ఈకార్యక్రమంలో కలెక్టర్ ప్రియాంక ఆల, అదనపు కమిషనర్ సంతోష్ కుమార్, జోనల్ కమిషనర్ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

# డ్రోన్‌ల ద్వారా ట్రాఫిక్ నిర్వహణ

-గోల్కొండ కోట బోనాల విస్తృత ట్రాఫిక్ బందోబస్తు

-వాహనాలు సజావుగా సాగేలా అన్ని ఏర్పాట్లు

- డ్రోన్‌లతో నిరంతర పర్యవేక్షణ



డ్రోన్‌ల ద్వారా తీసిన బోనాల ఫోటో.

**మెహిదీపట్నం, జులై 21, ప్రభాతవార్త :** నగరంలో అత్యంత వైభవంగా ప్రారంభమైన గోల్కొండ శ్రీ జగదాంబ మహంకాళి బోనాల ఉత్సవాలను మునుపెన్నడూ లేని విధంగా డ్రోన్ ల ద్వారా పర్యవేక్షిస్తున్నారు సిటీ ట్రాఫిక్ పోలీసులు. బోనాల ఉత్సవాలకు భక్తుల తాకిడి ఎక్కువగా ఉండడంతో గోల్కొండ పరిసర ప్రాంతాలతో పాటు ప్రధాన రహదారుల వెంట ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ఈనెల 16న ప్రారంభమైన బోనాల ఉత్సవాలకు సంబంధించిన ట్రాఫిక్ మళ్లింపులతో పాటు డ్రోన్ ల సహాయంతో తీసిన వాహనాల రాకపోకల ఫోటోలను విడుదల చేశారు ట్రాఫిక్ పోలీసులు. గోల్కొండ జోన్ ట్రాఫిక్ ఏసిపి డి ధనలక్ష్మి ఏర్పాట్ల వివరాలను వెల్లడించారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని గోల్కొండ కోట పరిసర ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు సుగమం చేయడానికి నగర ట్రాఫిక్ పోలీస్ శాఖ మొదటిసారిగా డ్రోన్ సర్వేలెన్స్ (డ్రోన్ల నిఘా) వ్యవస్థను అందుబాటులోకి తేవడం జరిగిదన్నారు. డ్రోన్ ల సహాయంతో పార్కింగ్ స్థలాలు, ప్రధాన ట్రాఫిక్ మళ్లింపు పాయింట్లను ఎప్పటికప్పుడు ఆకాశ మార్గం ద్వారా పర్యవేక్షిస్తూ, ట్రాఫిక్ జామ్‌లను తక్షణమే నివారించి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడం జరుగుతుందని తెలిపారు. ముందస్తుగా ప్రకటించిన రూట్ డైవర్షన్ల ప్రకారం వాహనాలు సజావుగా సాగేలా అన్ని ప్రధాన మళ్లింపు పాయింట్లను డ్రోన్ల ద్వారా నిరంతరం పర్యవేక్షించడంతో పాటు గోల్కొండ కోటకు సమీపంలో కేటాయించిన పార్కింగ్ స్థలాలలో వాహనాల రద్దీని అంచనా వేయడానికి, అనధికార పార్కింగ్‌ను నిరోధించడానికి మరియు భక్తులకు ఖాళీగా ఉన్న పార్కింగ్ స్థలాలను సూచించడానికి డ్రోన్ లను ఉపయోగిస్తున్నామన్నారు. కోటకు వెళ్లే ప్రధాన రహదారులు, అంతర్గత మార్గాలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో సమకూరే ప్రాంతాలలో ట్రాఫిక్ ఆటంకాలను తక్షణమే గుర్తించి, వెంటనే క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా నియంత్రణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఆధునిక డ్రోన్ సాంకేతికత వినియోగం వల్ల క్షేత్రస్థాయి ట్రాఫిక్ పరిస్థితిపై సమగ్ర అవగాహన ఏర్పడి, బోనాల ఉత్సవాల సందర్భంగా భక్తులకు మరియు సాధారణ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సురక్షితమైన, వేగవంతమైన ప్రయాణాన్ని అందించడానికి ఎంతగానో తోడ్పడుతోందని వివరించారు.

# ఖాళీ స్థలాల యజమానులను గుర్తించి చెత్త డంపింగ్‌ను అరికట్టాలి

- రోడ్లపై అక్రమ ఆక్రమణలు, అనధికార ర్యాంపులను వెంటనే తొలగించండి : ఎంఎంసీ కమిషనర్ ఆదేశం



అధికారులతో కలిసి కాప్రా సర్కిల్ పరిధిలోని కాలనీలలో పర్యటిస్తున్న ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

**హైదరాబాద్, జూలై 21 ప్రభాతవార్త:** మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి కాప్రా సర్కిల్ పరిధిలోని నాగార్జున నగర్ కాలనీలో డిప్యూటీ కమిషనర్, డిప్యూటీ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్, టౌన్ ప్లానింగ్ అధికారులు, అర్బన్ బయోడైవర్సిటీ (యూబీడీ) అధికారులు, శానిటేషన్ సిబ్బంది, రామ్‌కీ ప్రతినిధులు, ఈపీటీఆర్ఐ ప్రతినిధులతో కలిసి సమగ్ర క్షేత్రస్థాయి తనిఖీ నిర్వహించారు. తనిఖీ సందర్భంగా రహదారులు, ప్లాంటర్ బాక్స్‌ల పరిస్థితిని పరిశీలించిన కమిషనర్, ఖాళీగా ఉన్న అన్ని ప్లాంటర్ బాక్స్‌లను శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్ల (ఎస్ఎఫ్‌ఏలు) సమన్వయంతో గుర్తించి వెంటనే మొక్కలు నాటాలని, వాటి సంరక్షణ, నిర్వహణను నిరంతరం చేపట్టాలని అర్బన్ బయోడైవర్సిటీ విభాగాన్ని ఆదేశించారు. నగరంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు అందుబాటులో ఉన్న ప్రతి ప్లాంటర్ బాక్స్‌ను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. టౌన్ ప్లానింగ్ శాఖకు సంబంధించి రహదారులపై అక్రమంగా నిర్మించిన ర్యాంపులు, ఇతర ఆక్రమణలను వెంటనే తొలగించాలని, రోడ్లపై పేరుకుపోయిన నిర్మాణ మరియు కూల్చివేత వ్యర్థాలను తొలగించి, అవసరమైన చోట తక్కువ ఎత్తులో ఉన్న ప్రాంతాలను పూడ్చేందుకు వినియోగించే అవకాశాలను పరిశీలించాలని ఆదేశించారు. కొత్తగా చేపట్టే అన్ని నిర్మాణ పనులు తప్పనిసరిగా అధీకృత వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్‌తో అనుసంధానం చేసుకొని నిర్మాణ వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. అదేవిధంగా, అన్ని వాణిజ్య సంస్థలు తమ ట్రేడ్ లైసెన్సులను స్పష్టంగా ప్రదర్శించాలని, హాస్టళ్లు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్‌తో పాటు సంబంధిత అన్ని చట్టబద్ధ అనుమతులు, రికార్డులను నిర్వహించాలని సూచించారు. నిబంధనలు పాటించని సంస్థలపై ఎలాంటి మినహాయింపు లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఖాళీ స్థలాల యజమానులను గుర్తించి తమ స్థలాలను పరిశుభ్రంగా నిర్వహించేలా అవగాహన కల్పించాలని, అక్రమంగా చెత్త పారబోయకుండా నిరోధక చర్యలు చేపట్టాలని కమిషనర్ అధికారులకు సూచించారు. నగర పరిశుభ్రత, పచ్చదనం, శాస్త్రీయ వ్యర్థాల నిర్వహణ, నిబంధనల అమలులో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు పరిశుభ్రమైన, సురక్షితమైన పట్టణ వాతావరణాన్ని అందించాలని కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి దిశానిర్దేశం చేశారు.

**డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా నివారణ చర్యలపై ఎంఎంసీ సమీక్ష**

వర్షాకాలంలో వెక్టర్ ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణ, నియంత్రణ చర్యలను మరింత సమర్థవంతంగా అమలు చేయడం, సంబంధిత శాఖల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా జాతీయ వెక్టర్ ద్వారా వ్యాపించే వ్యాధుల నియంత్రణ కేంద్రం (ఎన్‌సీవీబీడీసీ) ఆధ్వర్యంలో మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కాన్ఫరెన్స్ హాల్, తార్నాకలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం ఎంఎంసీ అదనపు ఆరోగ్య కమిషనర్ సి.ఎన్. రఘు ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె. పద్మజ, అదనపు సంచాలకులు (ఎన్‌సీవీబీడీసీ ఎంఆండ్‌ఎఫ్), రాష్ట్ర ప్రోగ్రామ్ అధికారి వెక్టర్ ద్వారా వ్యాపించే వ్యాధుల నియంత్రణకు సంబంధించి క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై సమగ్ర అవగాహన కల్పించారు. ముఖ్యంగా డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా తదితర వ్యాధుల నివారణకు లార్వా నిర్మూలన, సోర్స్ రిడక్షన్, ఇంటింటి సర్వేలు, దోమల ఉత్పత్తి కేంద్రాల గుర్తింపు, నిరంతర పర్యవేక్షణ, ప్రజల్లో విస్తృత అవగాహన కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. వర్షాకాలంలో వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు అన్ని పట్టణ స్థానిక సంస్థలు, వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు నివారణ చర్యలను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంఎంసి అదనపు కమిషనర్ రఘు ప్రసాద్ పాటు డా. పద్మజ, జిహెచ్ఎంసి డిప్యూటి డైరెక్టర్ వెంకటేష్, హెల్త్ జాయింట్ కమిషనర్ మోహన్ రెడ్డి, ఎంఎంసి సీనియర్ ఎంటమా లాజిస్ట్ మాధవ రెడ్డి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ వెంకట రమణ, జీహెచ్ఎంసీ, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జిల్లా వైద్య ఆరోగ్య అధికారులు, సీనియర్ ప్రోగ్రామ్ అధికారులు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ అధికారులు, పట్టణ ఆరోగ్య యూనిట్ అధికారులు, ఎంటమాలజిస్టులు, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అధికారులు పాల్గొన్నారు.

## అధ్యాపకుల వేధింపులతో బిటెక్ విద్యార్థిని ఆత్మహత్య

**నార్సింగి, జూలై 21 ప్రభాతవార్త :** అధ్యాపకుల మానసిక వేధింపులను భరించలేక ఓ బిటెక్ విద్యార్థిని తన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. విషాదకరమైన ఈ దుర్ఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గండిపేట మండలం మణికొండ శ్రీరామ్‌నగర్ ప్రాంతానికి చెందిన వి.శ్రేయ (20) ఓ ప్రైవేటు కళాశాలలో బిటెక్ రెండో సంవత్సరం చదువుతుంది. గత జూలై నెలలో బిటెక్ ఫస్ట్ ఇయర్ పరీక్షలు రాస్తూ పొరపాటున తన మొబైల్‌ను వెంట తీసుకెళ్లింది. అధ్యాపకులు గమనించి ఆమెను మందలించారు. ఇటీవల తిరిగి రెండో సంవత్సరం తరగతులకు హాజరవుతుంది. ఈ సమయంలో కొంత మంది అధ్యాపకులు ఆమె పరీక్ష రాసే సమయంలో మొబైల్ తీసుకురావడంను గుర్తు చేస్తూ తరుచూ అవమానించారు. దీంతో మనస్థాపం చెందిన శ్రేయ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తన చావుకు కళాశాల అధ్యాపకుల మానసిక వేధింపులే కారణమంటూ రెండు పేజీల సూసైడ్ నోట్ రాసి చనిపోయింది. ఈ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నార్సింగి పోలీసులు తెలిపారు.

## అప్పుల బాధతో బీటెక్ విద్యార్థి ఆత్మహత్య..

**పేట్ బషీరాబాద్, జూలై 21, ప్రభాతవార్త** కరీంనగర్‌కు చెందిన మేకల శివకుమార్ (21), మైసమ్మగూడలోని నరసింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతూ దేవేందర్ నగర్ కాలనీ, కొంపల్లిలో నివాసం ఉంటున్నాడు. ప్రాథమిక సమాచారం ప్రకారం, శివకుమార్ స్నేహితులు, పరిచయస్తుల వద్ద డబ్బులు అప్పుగా తీసుకున్నట్లు తెలుస్తోంది. అప్పిచ్చిన వారు డబ్బులు తిరిగి చెల్లించాలని ఒత్తిడి చేయడంతో తీవ్ర మనస్తాపానికి గురైనట్లు సమాచారం. ఇంట్లో తల్లిదండ్రులను డబ్బులు అడిగితే మందలిస్తారనే భయంతో ఆయన తన గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై పెట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# నగరంలో రౌడీ షీటర్ దారుణ హత్య

-సోదరి, సోదరుని హత్యలకు ప్రతీకారం తీర్చుకున్న యువకుడు

-రౌడీషీటర్‌పై పెప్పర్ స్ప్రే చల్లి వెంటాడి హత్య

**సరూర్‌నగర్, జూలై 21 ప్రభాతవార్త:** హైదరాబాద్ పోలీస్ కమీషనరేట్ పరిధిలో ఓ రౌడీషీటర్ దారుణ హత్యకు గురయ్యాడు. తన సోదరి, సోదరుని హత్యలకు ప్రతీకారంగా ఓ యువకుడు రౌడీషీటర్‌పై కత్తులతో దాడి చేసి విచక్షణారహితంగా పొడిచి చంపాడు. పుట్టిన రోజు వేడుకకు హాజరైన రౌడీషీటర్ కళ్ళల్లోకి పేపర్ స్ప్రే చల్లిన తర్వాత పారిపోతుండగా వెంబడించి నడి రోడ్డుపైనే అంతమొందించి కక్ష తీర్చుకున్నాడు. హతమైన రౌడీషీటర్‌పై దాదాపు 18 పోలీస్ స్టేషన్లలో సుమారు 40కి పైగా కేసులు ఉన్నట్లు సమాచారం. అంతే కాకుండా అతడిని పోలీసు కమీషనర్ గతంలో నగర బహిష్కరణ కూడా చేసినట్లు తెలిసింది. కాగా రౌడీషీటర్‌ను హత్య చేసిన నిందితుడు పారిపోయి ఏకంగా ఇన్‌స్టాగ్రామ్‌లో లైవ్‌లో స్నేహితునితో మాట్లాడుతూ తానే హత్య చేసినట్లు ప్రకటించడం వైరల్ అయ్యింది. తీవ్ర కలకలం రేపిన ఈ హత్యోదంతం మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. కారు డ్రైవర్‌గా పని చేసే సూరి (41) ఉప్పల్‌లోని వెంకటేశ్వర దేవాలయ సమీపంలో తన రెండో భార్య పూజ, కూతురుతో పాటు తల్లి యాదమ్మతో కలిసి నివాసం ఉంటున్నాడు. 2022లో షబానా ఫాతిమా అనే యువతిని ప్రేమించి పెళ్ళి చేసుకున్న సూరి ఆ తర్వాత అనుమానంతో హత్య చేశాడు. ఆ తర్వాత తనను బెదిరించిన షబానా పెద్ద తమ్ముడు సల్మాన్‌ను 2024లో మీర్‌పేట్ పిఎస్ పరిధిలోనే హత్య చేశాడు. ఈ నేరాలపై సూరి జైలుకు వెళ్ళిన వచ్చిన తర్వాత పూజ అనే యువతిని రెండవ వివాహం చేసుకొని ప్రస్తుతం ఉప్పల్‌లో నివసిస్తున్నాడు. ఇదిలా ఉండగా తన అక్క, అన్నల హత్యలపై పగతో రగిలిపోయిన అఫ్రోజ్ (23) అదను కోసం వేచి చూస్తున్నాడు. ఈ క్రమంలో తన రెండవ భార్య సోదరుడు గోవింద్ పుట్టిన రోజు వేడుకలకు హాజరయ్యేందుకు కుటుంబంతో కలిసి సూరి సోమవారం రాత్రి నందననం గణేష్‌నగర్‌కు వచ్చాడు. అదే వేడుకకు అఫ్రోజ్ కూడా హాజరయ్యాడు. అయితే పక్కా ప్లాన్‌తో వచ్చిన అఫ్రోజ్ తన వెంట తెచ్చుకున్న పెప్పర్ స్ప్రేను అక్కడ ఖాళీ స్థలంలో ఉన్న సూరి కళ్ళల్లోకి చల్లాడు. దీంతో భయాందోళనకు గురైన రౌడీషీటర్ సూరి పరుగు తీసి నందనవనం మెయిన్ రోడ్డుపైకి రాగానే వెంబడించిన అఫ్రోజ్ కత్తితో ఛాతీ, తొడ, పొట్టపై విచక్షణారహితంగా దాడి చేసి పారిపోయాడు. తీవ్ర గాయాలతో విలవిలలాడుతున్న సూరిని కుటుంబ సభ్యులు డిఆర్‌డిఓ అపోలో ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న మీర్‌పేట్ పోలీసులు హత్య కేసును నమోదు చేశారు.

# నగరాన్ని కమ్మేసిన మేఘాలు

-పలుచోట్ల రోజంతా చిరుజల్లులు



**హైదరాబాద్, జూలై 21, ప్రభాతవార్త:** మహానగరంలో మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఆకాశంలో దట్టమైన నల్లని మేఘాలు అలుముకున్నాయి. అలాగే పలుచోట్ల సన్నటిచినుకులు పడ్డాయి. పలుచోట్ల వర్షం వచ్చినట్టే వచ్చి వెళ్లిపోయింది. ఇలా తీవ్రమైన ఉక్కపోతతో అల్లాడిపోతున్న నగరవాసులకు ఈ వర్షం కాస్త రిలీఫ్ కలిగించినప్పటికీ, నిత్యం రద్దీగా ఉండే వేళల్లో వాన పడుతుండటంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

## ప్రజారోగ్య కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేయాలి

-జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డా.పుట్ల శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్‌వో డాక్టర్ పుట్ల శ్రీనివాస్

**హైదరాబాద్, జూలై 21, ప్రభాతవార్త:** ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలను సమర్థవంతంగా అందించడం ప్రతి ఆరోగ్య సిబ్బంది బాధ్యత అని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డా.పుట్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈమేరకు మంగళవారం సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజారోగ్య కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. గర్భిణీల సంరక్షణ, సేవలు, శిశు టీకాలు, అంటువ్యాధుల నివారణ, సీజనల్ వ్యాధుల నియంత్రణ ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగీ, చికున్ గునియా పై ఇంటింటి ఆరోగ్య సర్వేలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అలాగే ఓపి సేవలు ఉదయం తొమ్మిది గంటల నుండి సాయంత్రం 4 గంటలకు నిర్వహించాలని, మెడికల్ ఆఫీసర్స్, సూపర్ వైజరీ సిబ్బంది తప్పకుండా ఫీల్డ్ సిబ్బందికి ఎప్పటికప్పుడు సూచనలు సలహాలు ఇస్తూ ఆరోగ్య కార్యక్రమాలు సకాలంలో పూర్తయ్యేటట్లు చూడాలన్నారు. వైద్యసేవల విషయంలో వైద్యులు సిబ్బంది అలసత్వము వహించకూడదు అని ప్రతిరోజు సమాచారంను పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా టిబి అధికారి డా చల్లా దేవి, అదనపు జిల్లా వైద్యాధికారి డా.అనిత, అడిషనల్ డిఎంహెచ్ఓ డాక్టర్ సరస్వతి , ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డా. శ్రీధర్, డా,సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

## గోల్కొండ జగదాంబిక మహంకాళి దేవాలయ హుండీ రూ. 3,70,465 ఆదాయం



**మెహిదీపట్నం జులై 21, ప్రభాతవార్త :** గోల్కొండ శ్రీ జగదాంబికా మహంకాళి (ఎల్లమ్మ తల్లి) అమ్మవారి దేవాలయంలో హుండీ లెక్కింపును మంగళవారం చేపట్టారు. మొదటి రెండవ పూజలలో పాల్గొన్న భక్తులు అమ్మవారికి సమర్పించిన కానుకల ద్వారా 3 లక్షల 70 వేల 465 నగదు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో సి. వసంత వెల్లడించారు. ఆలయ చైర్మన్ ఆకుల చంద్రశేఖర్, ఇన్స్పెక్టర్ రాజరాజేశ్వరిల పర్యవేక్షణలో ఈ లెక్కింపు ప్రక్రియ జరిగింది. సభ్యులు వివేక్ గౌడ్, భరత్, శ్యామల, వీరస్వతి, గీత, రావులపల్లి శ్రీకాంత్ లతోపాటు ఆలయ పూజారి సర్వేష్ కుమార్ లు హుండీ లెక్కింపులో పాల్గొన్నారు.

## విద్యార్థుల తలలు పగలగొట్టడమే బిజెపి లక్ష్యమా..!

-సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కిషన్ ఉపాధ్యక్షులు శివకుమార్




**తుర్కయంజాల్ జులై 21, ప్రభాతవార్త**

ఆదిభట్ల జిహెచ్ఎంసి సర్కిల్ తొర్రూరు డివిజన్ తుర్కయంజాల్ చౌరస్తాలో భారీ ర్యాలీ...భగత్ సింగ్ వారసులుగా ప్రాణాలు పోయినా పోరాడుతాం..దేశ రాజధానిలో జంతర్ మంతర్ వద్ద నీట్ యూజీ పరీక్షల అక్రమాలపై కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని క్రాక్రోచ్ జనతా పార్టీ మరియు విద్యార్థి సంఘాల విద్యార్థులు ఆందోళన చేస్తుంటే ఆ విద్యార్థులపై బిజెపి ప్రభుత్వం ధమనకాండ ప్రయోగించి లాఠీ ఛార్జ్ చేసి విద్యార్థుల తలలు పగలగొట్టడం బాష్ప వాయువు ప్రయోగించి విద్యార్థులను అణచివేయడం దేనికి నిదర్శనమని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు గుండె శివ కుమార్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు డి వేణు, సుమంత్, యంజల్ ఎస్ఎఫ్ఐ ఇంచార్జ్ కార్తీక్ నాయకులు మణికుమార్, సాయి, పాషా, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి : సెక్రటరీ డాక్టర్ శ్యాంసుందర్ రెడ్డి




విద్యార్థులకు మొక్కలను పంపిణీ చేస్తున్న అనిబిసెంట్ మహిళా డిగ్రీ కళాశాల సెక్రటరీ డాక్టర్ శ్యాంసుందర్ రెడ్డి తదితరులు

**మలక్ పేట, జులై 21, ప్రభాతవార్త:**

పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని అనిబిసెంట్ డిగ్రీ మహిళా కళాశాల సెక్రటరీ డాక్టర్ శ్యాంసుందర్ రెడ్డి పేర్కొన్నారు.తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా అనిబిసెంట్ మహిళా డిగ్రీ కళాశాలలో ఈకో క్లబ్ నేచర్స్ నుక్ ఆధ్వర్యంలో మొక్కల నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కళాశాల కార్యదర్శి డా. శ్యామ్ సుందర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రిన్సిపాల్ రాజవల్లి దేవి అధ్యక్షతన వారు కళాశాల ప్రాంగణంలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా డాక్టర్ శ్యామ్ సుందర్ రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ప్రిన్సిపాల్ రాజవల్లి దేవి మాట్లాడుతూ, హరితహారం వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థినుల్లో పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన, బాధ్యత పెంపొందుతుందని తెలిపారు.అనంతరం వారు కళాశాల హెచ్ఓడీలు, అధ్యాపకులకు మొక్కలను అందజేసి, వాటిని తమ ఇళ్లలో నాటి సంరక్షించాలని ఈకో క్లబ్ తరఫున విజ్ఞప్తి చేశారు. అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని మొక్కలు నాటారు. ఈకో క్లబ్ కన్వీనర్లు కె. కల్పన మరియు అర్షియా అఫ్రీన్ సమన్వయం చేసి విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## హిట్లర్‌ని తలపిస్తోన్న మోడీ,అమిత్ షా పాలన

**హయత్ నగర్, జులై 21 ప్రభాతవార్త :**

ఢిల్లీలో విద్యార్థులపై, నిరసనకారులపై పోలీసుల దాడి హిట్లర్ పాలనను తలపించిందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారీ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. నీట్ పరీక్ష నిర్వహణలో అవకతవకలు, పేపర్ లీకేజీలపై బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి దర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనీ డిమాండ్ చేస్తూ ఢిల్లీలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో విద్యార్థులు, యువత, నిరసనకారుల పట్ల అత్యంత దారుణంగా పోలీసులు లాఠీచార్జి చేయడం బాష్ప వాయువు ప్రయోగించడం మోడీ, అమిత్ షా నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. పోలీసుల ముసుగులో ఉన్న మతోన్మాద గుండాలు కూడా విద్యార్థులపై అత్యంత పాషావీకంగా దాడి చేసి గాయపరిచారని మండిపడ్డారు. యువత భవిష్యత్తును ప్రభావితం చేసే పరీక్షల నిర్వహణలో పారదర్శకత, జవాబు దారీతనం ఉండాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే విద్యార్థి ప్రతినిధులతో తక్షణమే చర్చలు జరిపి, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. అప్రజాస్వామిక ఢిల్లీ ఘటనకు బాధ్యత వహిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

## విద్యార్థికి లక్ష నగదు ప్రోత్సాహక బహుమతి



విద్యార్థి సునిగెంటి చరణ్‌ను సన్మానిస్తున్న శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రతినిధులు పాఠశాల ప్రిన్సిపాల్ కే. వెంకట్ రెడ్డి తదితరులు

**మలక్ పేట జోన్ ప్రతినిధి, జులై 21, ప్రభాతవార్త:** అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, తొర్రూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థి సునిగెంటి చరణ్ 2025-26 విద్యా సంవత్సరంలో ఎస్ఎస్‌సి పరీక్షల్లో 580 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రంగారెడ్డి జిల్లాలో ద్వితీయ ర్యాంకుతో పాటు ఇబ్రాహీంపట్నం నియోజకవర్గంలో ప్రథమ ర్యాంకు సాధించిన సందర్భంగా శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ వారు రూ.1,00,000 (ఒక లక్ష రూపాయలు) నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రతినిధులు చరణ్‌ను ఘనంగా సన్మానించి నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. విద్యార్థి సాధించిన ఈ విశిష్ట విజయాన్ని అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కూడా కృషి, పట్టుదలతో అత్యున్నత విజయాలను సాధించగలరని చరణ్ నిరూపించాడని పేర్కొన్నారు. విద్యార్థిని ప్రోత్సహించిన శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సత్యనారాయణరావు, రమణారెడ్డి, అరుణ్ కుమార్ , రంగరాజు, కరుణాకర్ రెడ్డి, భాగ్యమ్, నర్సింహా, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ రమ్య, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రతినిధులు, తల్లిదండ్రులు తదితరులు విద్యార్థిని అభినందించారు. అదే విధంగా విద్యార్థి విజయానికి సహకరించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బందిని కూడా ఈ సందర్భంగా అభినందించారు.



ప్రశాంతిహిల్స్ డివిజన్‌లో బిజెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ వద్ద ఎన్యూమరేషన్ ఫారాలు పూరించడంలో ఓటర్లకు సాయం చేస్తున్న పసునూరి బిక్షపతిచారి

## ఇండోర్ స్టేడియంలో వేగవంతంగా మరమ్మతు పనులు : ఎమ్మెల్యే అహ్మద్ బలాల

**మలక్ పేట, జులై 21,ప్రభాతవార్త:**

మలక్ పేట్ శ్రీపురం కాలనీ ఇండోర్ స్టేడియంలో వేగవంతంగా మరమ్మత్తు పనులను, అభివృద్ధి పనులను చేపట్టాలని మలక్ పేట్ నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల ఎమ్మెల్యే పేర్కొన్నారు.మలక్‌పేట్ నియోజకవర్గం మూసీ నది పరివాహక ప్రాంతంలోని అఫ్జల్‌నగర్ రోడ్డు, శ్రీపురం కాలనీ ఇండోర్ స్టేడియంలను మలక్ పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బలాల, జీహెచ్ యంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ కన్నం సత్యనారాయణ, పలు విభాగల అధికారులతో కలసి మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ పర్యటనలో రహదారి పరిస్థితులు, ట్రాఫిక్ నిర్వహణ, ప్రజలకు కల్పించాల్సిన మౌలిక వసతులు, అవసరమైన అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే అహ్మద్ బలాల అధికారులతో సమీక్షించారు. అనంతరం శ్రీపురం కాలనీలోని ఇండోర్ స్టేడియాన్ని ఎమ్మెల్యే అహ్మద్ బలాల, జోనల్ కమిషనర్ సత్యనారాయణ లు పరిశీలించారు. స్థానిక కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కనుకుల రవీందర్ రెడ్డి కార్యదర్శి, ఇతర సభ్యులు స్టేడియానికి సంబంధించిన సమస్యలు, చెపట్టవలసిన అభివృద్ధి పనుల గురించి ఎమ్మెల్యే, జోనల్ కమిషనర్ ల దృష్టికి తీసుకువచ్చారు . ఈ సందర్భంగా ఎమ్మెల్యే అహ్మద్ బలాల మాట్లాడుతూ శ్రీపురం కాలనీ ఇండోర్ స్టేడియంలో మరమ్మత్తు పనులు చేపడతామని తెలిపారు. స్టేడియంలో అవసరమైన సౌకర్యాల కల్పన, నిర్వహణ అభివృద్ధి పనులను త్వరితగతిన చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అహ్మద్ బలాల ఆదేశించారు.అనంతరం జోనల్ కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజల సమస్యలను ప్రథమ ప్రాధాన్యతగా తీసుకుని అధికారులు వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు.పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ పర్యటనలో తమ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు చెబుతామని తెలిపారు. అఫ్జల్ నగర్ ప్రాంతంలోని రోడ్లు, శ్రీపురం కాలనీ ఇండోర్ స్టేడియం సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సైపుద్దీన్ షఫీ, టౌన్ ప్లానింగ్ విభాగం సీపీ శ్రీనివాసరావు, మలక్ పేట్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మాధవి, డి ఈ లు, ఏఈ లు. ఏసీపి, ట్రాఫిక్ పోలీసులు, శానిటేషన్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.



శ్రీపురం కాలనీ ఇండోర్ స్టేడియంని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల, జోనల్ కమిషనర్ సత్యనారాయణ, చిత్రంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కనుకుల రవీందర్ రెడ్డి తదితరులు

## బాలాపూర్, నాదర్‌గుల్, బడంగ్‌పేట్ డివిజన్‌లో కాంగ్రెస్ బిఎల్ఎలతో సమీక్ష

**సరూర్‌నగర్, జులై 21 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని జిహెచ్ఎంసి బాలాపూర్, నాదర్‌గుల్, బడంగ్‌పేట్ డివిజన్లలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై బిఎల్ఎలతో సమీక్షా సమావేశాలు నిర్వహించారు. పార్టీ అధిష్టానవర్గం ఎస్ఐఆర్‌పై సీరియస్‌గా తీసుకున్న నేపథ్యంలో ఈ సమావేశాలను ఏర్పాటు చేశారు. మహేశ్వరం నియోజకవర్గం ఎస్ఐఆర్ కాంగ్రెస్ పరిశీలకునిగా నియమితులైన యెల్మేటి అమరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బాలాపూర్ డివిజన్‌కు సంబంధించిన సమావేశం మల్లాపూర్‌లోని వైఆర్ కన్వెన్షన్స్‌లో అదే విధంగా నాదర్‌గుల్ డివిజన్‌కు సంబంధించిన సమావేశం అల్మాస్‌గూడలోని ఎపిఆర్ఆర్ గార్డెన్స్‌లో, బడంగ్‌పేట్ డివిజన్‌కు సంబంధించిన సమావేశం బడంగ్‌పేట్ ప్రజాభవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా బాలాపూర్ డివిజన్‌కు ఎస్ఐఆర్ ఇంచార్జిగా సురేష్‌రెడ్డి, నాదర్‌గుల్‌కు జ్ఞానేశ్వర్ యాదవ్, బడంగ్‌పేట్‌కు ప్రశాంత్‌రెడ్డిలు హాజరై ఎస్ఐఆర్‌పై బిఎల్ఎలకు, పార్టీ నాయకులకు దిశా నిర్దేశనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిఎల్ఎలు బిఎల్ఓలతో, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకొని అర్హులైన ఓటర్లను గుర్తించి వారి ఓటు హక్కును కాపాడడానికి కృషి చేయాలని సూచించారు. ఓటర్లందరూ సక్రమంగా ఎన్యూమరేషన్ ఫారాలు పూరించే విధంగా సహాయపడాలన్నారు. బిఎల్ఎలు బాధ్యతాయుతంగా పని చేసి ఎస్ఐఆర్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మూడు డివిజన్లతో జరిగిన ఈ ప్రత్యేక సమావేశాల్లో కొత్తగా డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులుగా నియమితులైన నీరుడు శ్రీరాములు (బాలాపూర్), బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి (నాదర్‌గులే), బంగారు అశోక్ (బడంగ్‌పేట్)లతో పాటు రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు క్యారగారి శ్రీధర్, మూడు డివిజన్లకు చెందిన పార్టీ నాయకులు నవారు మల్లారెడ్డి, పెత్తుల్ల ఆనందరెడ్డి, బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, రాళ్ళగూడెం శ్రీనివాస్‌రెడ్డి, పుట్టగళ్ళ జగన్, బాలు నాయక్, గట్టు బాలకృష్ణ, గుర్రం లక్ష్మీనర్సమ్మ, గొరిగె అయిలమ్మ, వంగేటి మధుసూదన్‌రెడ్డి, గొరిగె శ్రీశైలం, రావుల లింగం, గుండ్ల కొమురయ్య, దిండు శ్రీనివాస్‌గౌడ్, రామిడి శ్రీనివాస్‌రెడ్డి, మర్రి శశాంక్‌రెడ్డి, భీమిడి చంద్రపాల్‌రెడ్డి, రవికాంత్‌రెడ్డి, అమృతానాయుడు తదితరులు పాల్గొన్నారు.



బిఎల్ఎలతో సమీక్షా సమావేశానికి హాజరైన ఇంఛార్జిలు, నాయకులు

## మహేశ్వరం నియోజకవర్గంలోని డివిజన్లకు కాంగ్రెస్ అధ్యక్షుల నియామకం

**సరూర్‌నగర్, జులై 21 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని కొత్త జిహెచ్ఎంసి డివిజన్లకు కాంగ్రెస్ అధ్యక్షులను నియమించారు. మొత్తం 15 మున్సిపల్ డివిజన్లకు కొత్తగా కాంగ్రెస్ అధ్యక్షులను అధిష్టానవర్గం నియమించి ప్రకటించింది. ఈ నేపథ్యంలో బడంగ్‌పేట్ సర్కిల్‌లోని నాదర్‌గుల్‌కు బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, బడంగ్‌పేట్‌కు అంకంగారి వెంకటేశ్‌గౌడ్, బాలాపూర్‌కు నీరుడు శ్రీరాములు, మీర్‌పేట్‌కు చల్లా బాల్‌రెడ్డి, జిల్లెలగూడకు సిద్దాల శ్రీశైలం, ప్రశాంతిహిల్స్‌కు ఇ.సురేందర్‌రెడ్డి, జల్‌పల్లి సర్కిల్‌లోని జల్‌పల్లి డివిజన్‌కు షేక్ జహంగీరుద్దీన్, పహాడీషరీఫ్‌కు షేక్ యూసుఫ్, షాహీన్‌నగర్‌కు అహ్మద్ బామ్‌లను నియమించారు. అదే విధంగా తుక్కుగూడ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షునిగా బోద పాండురంగారెడ్డి, మంఖాల్‌కు ఎ.విజయ్ భాస్కర్‌రెడ్డి, సరూర్‌నగర్ డివిజన్‌కు బోయిని శంకర్‌యాదవ్, డాక్టర్స్ కాలనీకి నల్లెంకి ధన్‌రాజ్‌గౌడ్, రామకృష్ణాపురంకు పున్న గణేష్ నేత, ఎన్టీఆర్ నగర్‌కు ఎం.లింగస్వామిగౌడ్‌లు నియమితులయ్యారు.

**ఆశావహుల అసంతృప్తి**

కాగా మహేశ్వరం నియోజకవర్గంలోని డివిజన్లకు కాంగ్రెస్ అధ్యక్షుల నియామకాల పట్ల కొంతరు నాయకులు అసంతృప్తికి గురయ్యారు. డివిజన్ అధ్యక్ష పదవిని ఆశించిన పలువురు నిరాశకు గురయ్యారు. తమకే అధ్యక్ష పదవిని ఇప్పిస్తామని మాట ఇచ్చి తప్పిన నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జిపై కొందరు నేతలు అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే డివిజన్ కాంగ్రెస్ అధ్యక్ష పదవిని ఆశించి భంగపడ్డ కొందరు నేతలు గాంధీభవన్‌లో నిరసన వ్యక్తం చేయడానికి సిద్ధపడుతున్నట్లు తెలిసింది.



బాలాపూర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షునిగా నియమితులైన నీరుడు శ్రీరాములును సన్మానిస్తున్న యెల్మేటి అమరేందర్‌రెడ్డి

## మునగనూర్‌లో 12 ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం

-నిషేధిత జాబితా (22ఏ)లో చేర్చి ప్రభుత్వ భూమిని పరిరక్షించాలి

-జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారికి వినతి



**తుర్కయంజాల్ జులై 21, ప్రభాతవార్త**

ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని తొర్రూర్ డివిజన్, మునగనూర్ రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వే నంబర్లు 44/2, 44/4లోని సుమారు 12 ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతానికి గురైందని మాజీ ఎంపీ బూర నర్సగౌడ్ ఆరోపించారు. ప్రభుత్వానికి చెందిన ఈ విలువైన భూమిని వెంటనే పరిరక్షించి నిషేధిత జాబితా (22 ఏ)లో చేర్చాలని డిమాండ్ చేస్తూ జీహెచ్ఎంసీ 53, 56 డివిజన్ అధ్యక్షులు ఎలిమినేటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్. శారదా దేవికి వినతిపత్రం అందజేశారు. బూర నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ, సంబంధిత భూమిని సీసీఎల్ఏ ఇప్పటికే ప్రభుత్వ భూమిగా గుర్తించినప్పటికీ, కొందరు వ్యక్తులు అక్రమంగా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించే బాధ్యత రెవెన్యూ శాఖపై ఉందని పేర్కొంటూ, అధికారులు వెంటనే భూమి వద్ద ప్రభుత్వానికి చెందినదని తెలియజేసే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, సరిహద్దులను స్పష్టంగా గుర్తించి ఎలాంటి ఆక్రమణలు జరగకుండా చర్యలు చేపట్టాలని కోరారు.ప్రభుత్వ భూమి అన్యాక్రాంతంపై సుమోటోగా కేసు నమోదు చేసి సమగ్ర విచారణ నిర్వహించాలని, ఆక్రమణలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆస్తిగా ఉన్న ప్రభుత్వ భూములను కాపాడడంలో అధికారులు ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించరాదని, తక్షణమే చర్యలు తీసుకోకపోతే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించి, అక్రమ ఆక్రమణలను అరికట్టేందుకు శాశ్వత చర్యలు చేపట్టాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో బోసుపల్లి ప్రతాప్ నారాయణ యాదవ్, కొత్త రామ్‌రెడ్డి, బచ్చిగళ్ల రమేష్, కొండ్రు పురుషోత్తం, యూసుఫ్ రెడ్డి, నోముల కార్తీక్ గౌడ్, మల్లెల ప్రేమ్ సాయి, కోలాను రవీందర్ రెడ్డి, నందగిరి సురేష్, గుండ కృష్ణ, రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణ కోసం పటిష్టమైన చర్యలు

: ఇన్ స్పెక్టర్ కాసాని బ్రహ్మ మురారి



నిందుతున్న అదుపులో తీసుకున్న పోలీసులు

**మలక్ పేట, జులై 21, ప్రభాతవార్త:**

శాంతిభద్రతల పరిరక్షణ కోసం పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్టు చాదర్ ఘాట్ ఇన్ స్పెక్టర్ కాసాని బ్రహ్మ మురారి పేర్కొన్నారు. చాదర్ ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని చాదర్ ఘాట్ పోలీసులు అదుపులోకి తీసుకుని కోర్టుకు తరలించగా కోర్టు మూడు రోజుల సాధారణ జైలు శిక్షణ విధించడం జరిగిందని ఇన్ ఫెక్షన్ కాసాని బ్రహ్మ మురారి తెలిపారు. ఇన్ స్పెక్టర్ కాసాని బ్రహ్మ మురారి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బాలాపూర్ షాహీన్ నగర్ కు చెందిన సయ్యద్ ఖలీల్ (28) అనే వ్యక్తి నేరానికి పాల్పడే ఉద్దేశంతో చాదర్ ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో పోలీసులు గమనించి అతని అదుపులో తీసుకుని హైదరాబాద్ సిటీ పోలీస్ యాక్ట్ సెక్షన్ 61 (బి) కింద ఈ పెట్టి కేస్ నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా కేసును విచారించిన హైదరాబాద్ జువ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎం. భాస్కర్ కేసులోని ఆధారాలను పరిశీలించి నిందితుడికి మూడు రోజుల సాధారణ జైలు శిక్ష విధించారని ఇన్ స్పెక్టర్ కాసాని బ్రహ్మ మురారి తెలిపారు. ఈ మేరకు ఎస్ ఐ సురేష్ రెడ్డి కేసును దర్యాప్తు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇన్ స్పెక్టర్ కాసాని బ్రహ్మ మురారి మాట్లాడుతూ ప్రజల్లో భయాందోళనలు సృష్టించేలా లేదా నేరాలకు పాల్పడే ఉద్దేశంతో అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులపై నిరంతర నీఘా కొనసాగుతుందని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## కాలనీ సమస్యలపై ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి వినతి



ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి సమస్యలు విన్నవిస్తున్న బిఆర్ఎస్ నేత ఎండి.జహంగీర్, గంధం నాగేశ్వర్‌రావు తదితరులు

**రామంతాపూర్, జులై 21 ప్రభాతవార్త :**

రామంతాపూర్ డివిజన్ బాలకృష్ణ నగర్ కాలనీ సమస్యలపై మంగళవారం బిఆర్ఎస్ సీనియర్ నేత ఎం.డి. జహంగీర్ ఆధ్వర్యంలో పలువురు పార్టీ నేతలు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ బాలకృష్ణ నగర్ కాలనీ నెలకొన్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్ మరియు సీసీ రోడ్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. త్వరలోనే అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్ మరియు సీసీ రోడ్ల పనులకు మంజూరు చేయిస్తామని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా, ప్రతి కాలనీకి మౌళిక వసతులు అందించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. బిఆర్ఎస్ నేత ఎం.డి. జహంగీర్ మాట్లాడుతూ స్థానిక సమస్యలపై ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సానుకూలంగా స్పందించారని తెలిపారు. అదే విధంగా వెంకటసాయి నగర్ కాలనీ సమస్యలపై కాలనీ అధ్యక్షుడు ఎ.విజయేందర్‌రెడ్డి ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ సీనియర్ నాయకులు గంధం నాగేశ్వరరావు , ఎండి జహంగీర్, కాలనీ నేతలు పర్వేజ్, రాజ్యలక్ష్మి, సుందరయ్య, చంద్రమౌళి, రేణుక, ఎస్.చిన్నయ్య, నరేందర్, మహేష్, హేమలత, సురేష్, జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కబ్జా చెరనుండి పార్కును కాపాడాలని హైడ్రాకు వినతి



హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

**సైదాబాద్, జులై 21 ప్రభాతవార్త:** చంపాపేట డివిజన్ బైరామల్‌గూడ ఎస్.వి కాలనీలోని పార్కును కబ్జా నుండి కాపాడాలని కోరుతూ ఎల్బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మంగళవారం కాలనీవాసులతో కలసి హైడ్రా కమీషనర్ రంగనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో పార్క్ అభివృద్ధి కోసం రూ.12 లక్షలు మంజూరు చేయడం జరిగిందని, పార్కులో వాకింగ్ ట్రాక్, మొక్కలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అయితే పార్కును కొందరు కబ్జా చేసి అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని, వాటిని వెంటనే తొలగించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో చంపాపేట బిఆర్ఎస్ అధ్యక్షుడు ముదుపు రాజిరెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా జగన్నాథ స్వామి రథోత్సవం



రథోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

**సైదాబాద్, జులై 21 ప్రభాతవార్త:** కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయంలో ఉన్న శ్రీ జగన్నాథస్వామి, శ్రీ బలభద్రస్వామి, సుభద్రాదేవిల రథోత్సవాన్ని మంగళవారం మధ్యాహ్నం భక్తజన సందోహం మధ్య శ్రీ త్రిదండి భక్తి సౌరభ్ నారాయణ్ మహరాజ్ ఆశిస్సులతో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ లావణ్య, ఆలయ సిబ్బంది, అర్చకులు, మాజీ ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## ఆర్కేపురం కాంగ్రెస్ అధ్యక్షునిగా పున్న గణేష్‌నేత



**ఎల్.బి.నగర్, జులై 21 ప్రభాతవార్త:**

ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా పున్న గణేష్ నేత నియామ కమయ్యారు. మూడు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా పనిచేస్తున్న గణేష్ నేత రెండవసారి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా రెండవసారి నియామకానికి సహకరించిన మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, మంత్రి దుదిల్ల శ్రీధర్‌బాబు, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్, జిల్లా అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి సలహాలు సూచనలతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరే విధంగా పనిచేస్తానని, డివిజన్లోని కాలనీల సమస్యలను తీర్చి సమస్యలు లేని డివిజన్‌గా మార్చడానికి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలు విజయవంతం చేయడానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

## అర్హులంతా 'సర్'లో నమోదు చేయించుకోవాలి

**సైదాబాద్, జులై 21 ప్రభాతవార్త:**



సరస్వతి నగర్ డివిజన్‌లో కొనసాగుతున్న 'సర్' కార్యక్రమాన్ని ఏఎంసి వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేయించుకోవాలని సూచించారు. ఓటు హక్కు అనేది రాజ్యాంగం దేశ పౌరులకు కల్పించిన హక్కు అని, తప్పని సరిగా 'సర్'లో దరఖాస్తు సమర్పించాలని కోట్ల శ్రీనివాస్ కోరారు.

## హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ బేటి



**ఉప్పల్, జులై 21 ప్రభాతవార్త :** ఉప్పల్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మంగళవారం హైడ్రా కమిషనర్ రంగనాద్‌తో బేటి అయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గం పరిధిలో ఇటీవల హైడ్రా చేపట్టిన ఉప్పల్ నల్లచెరువు, రామంతపూర్ పెద్ద చెరువు, హెచ్ఎంటి నగర్ చెరువు, కాప్రా చెరువుల అభివృద్ధిపై హైడ్రా కమిషనర్ రంగనాదజ్‌తో చర్చించినట్లు తెలిపారు. చెరువులలో నీటి నిలువ సామర్థం పెంపు, సరిహద్దులు పరిరక్షణ, టిడిఆర్ కేటాయింపులు, గుడిసెలలో నివాసముంటున్న వారి పునరావాసం, చెరువుల సుందరీకరణ పనులపై పలు సూచనలు చేసినట్లు తెలిపారు. దీనిపై హైడ్రా కమిషనర్ రంగనాద్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. త్వరలోనే రామంతపూర్ చిన్న చెరువు మరియు నాచారం ఎర్రగుంట చెరువును కూడా అభివృద్ధి చేస్తామని హైడ్రా కమిషనర్ హామీ ఇచ్చారని ప్రభాకర్ తెలిపారు. చెరువుల అప్ స్ట్రీమ్ పైనే ఎస్టీపీల నిర్మాణం కూడా జరిగేటట్టుగా చూడాలని హైడ్రా కమిషనర్‌ను కోరారు.కార్యక్రమంలో పలువురు బిజెపి నేతలు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియ వేగవంతంగా సాగేలా చూడాలి : రజితరెడ్డి



ఉప్పల్‌లో ఓటర్లకు సర్ పారం అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ ఎం.రజిత పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, జులై 21 ప్రభాతవార్త :** సర్ ప్రక్రియ సాఫీగా, వేగవంతంగా సాగేలా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పని చేయాలని ఉప్పల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఉప్పల్ కచ్చిర్ స్కూల్ వద్ద కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు ఈగ ఆంజనేయులు ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్ సహాయ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నిజమైన ఓటర్లకు సర్ ప్రక్రియతో ఎలాంటి నష్టం లేకుండా చూడాలని సూచించారు. బీఎల్ఓతో సమన్వయం చేసుకుంటూ ఓటర్లకు సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఈగ ఆంజనేయులు ముదిరాజ్, బజారు జగన్నాదజ్ గౌడ్, తుమ్మల దేవి రెడ్డి, సల్లా ప్రభాకర్ రెడ్డి, మంద మురళీ కృష్ణా రెడ్డి, మాశెట్టి రాఘవేందర్, భూత్కూరి మదన్ గౌడ్, కన్నమైన నరేష్, భాస్కర్ రెడ్డి. గోరిగె మహేష్. అలుగుల అనిల్. బచ్చా రాము, రాంరెడ్డి, రంగుల శేఖర్, ముదిగొండ రవి, ప్రశాంత్ రెడ్డి, మీనంపల్లి కిషోర్ ,చంద్రశేఖర్ రెడ్డి, విజయ్, ఆసిఫ్, బట్కిరి కుమార్, తైసిన్, మోసిన్, అతిఫ్, వహీద్ పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా రేణుకాదేవి కళ్యాణ మహోత్సవం



కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న మనోహరశర్మ చిత్రంలో వెంకటమ్మ దంపతులు

**ఎల్.బి.నగర్, జులై 21 ప్రభాతవార్త:** శ్రీరేణుకాదేవి(ఎల్లమ్మ), శ్రీవిజయదుర్గాదేవి సమేత అమ్మవార్ల పుష్కర బ్రహ్మోత్సవాల్లనీ భాగంగా శ్రీ రేణుకాదేవి జమదగ్ని మహర్షుల దివ్య కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించినట్లు శ్రీదేవి ఉపాసకురాలు గురుమాత సోమ వెంకటమ్మ తెలిపారు. ఈనెల 17వ తేదీ నుంచి 22వ తేదీ వరకు కొత్తపేట న్యూమారుతినగర్ రోడ్ నెంబర్ 5లోని శ్రీరేణుక ఎల్లమ్మ, శ్రీవిజయదుర్గాదేవి అమ్మవార్ల పుష్కర బ్రహ్మోత్సవాలు భక్తుల కోలాహలం మధ్య అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. చండిఉపాసకులు బ్రహ్మశ్రీ పాలెం మనోహర్‌శర్మ నేతృత్వంలో గత ఐదు రోజులుగా పుష్కర బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా మంగళవారం శ్రీరేణుకాదేవి సమేత శ్రీవిజయదుర్గ అమ్మవార్లకు శతౌశదీయుక్త మహా బలాభిషేకము, అలంకారము, కొట్నం, బియ్యము సుంకించుట, జిగువిత్తుట కార్యక్రమాల అనంతరం భక్తుల కోలాహలం మధ్య శ్రీరేణుకాదేవి జమదాగ్ని మహర్షుల దివ్యలీలా కళ్యాణ మహోత్సవము, నాగవల్లి, ఇద్దరమ్మాలకు పెద్దపట్నాలు, విశ్వరూప సందర్శనము, సప్తఘటిక బోనం సమర్పణ కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం భక్తులకు మహాదాశీర్వచనం చేశారు.

## బైండోవర్ ఉల్లంఘన కేసులో రౌడీ షిటర్‌కు జరిమాన

**మలక్ పేట, జులై 21, ప్రభాతవార్త:**

చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ నిమిత్తం నమోదు చేసిన బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించినందుకు గాను రౌడీ షీటర్ కు జరిమానాను విధించారు. ఇన్ స్పెక్టర్ కాసాని బ్రహ్మ మురారి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ నిమిత్తం నమోదు చేసిన బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించినందుకు గాను రౌడీ షీటర్ గడ్డం అక్షయ్ కుమార్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరిగింది. సత్ర్రవర్తన బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించినందుకు గాను స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ కోర్టు సదరు రౌడీ షీటర్‌కు రూ.30,000/ చలానా (జరిమానా) విధించింది.కాగా సదరు చలానా మొత్తాన్ని తగ్గించాల్సిందిగా రౌడీ షీటర్ గడ్డం అక్షయ్ కుమార్ అభ్యర్థించగా, అతని విన్నపాన్ని పరిశీలించిన స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ కోర్టు చలానా మొత్తాన్ని ..20,000/ లకు సవరిస్తూ నిబంధనలు జారీ చేయడం జరిగిందని ఇన్ స్పెక్టర్ కాసాని బ్రహ్మ మురారి వివరించారు.ఈ క్రమంలో న్యాయస్థానం ఆదేశాల మేరకు రౌడీ షీటర్ గడ్డం అక్షయ్ కుమార్ సవరించిన చలానా మొత్తం రూ.20 వేలను చెల్లించినట్లు తెలియజేశారు. ప్రజా శాంతిభద్రతలకు భంగం కలిగించే రౌడీ షీటర్లు, నిత్య నేరస్థులపై చట్టప్రకారం కఠిన చర్యలు కొనసాగుతాయని, బైండోవర్ నిబంధనలను ఉల్లంఘిస్తే తీవ్రమైన చట్టపరమైన పరిణామాలు ఉంటాయని ఇన్‌స్పెక్టర్ బ్రహ్మమురారి పేర్కొన్నారు.



హబ్సిగూడలో సీతల పండుగ వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కంది శ్రవణ్‌రెడ్డి, బిఆర్ఎస్ నేత సోమిరెడ్డి, రజితరెడ్డి తదితరులు